తేదీ 31.5.2008, సాయిరమేశ్ క్రిషన్ హాలు, బృందావనం

# ఏకత్వమే దైవత్వము

**సర్వరూప ధరం శాంతం సర్వనామ ధరం శివం**
**సచ్చిదానంద మద్వైతం సత్యం శివం సుందరం**

ఆత్మస్వరూపులారా!

ఈనాడు లోకంలో జనులు అన్ని విద్యలూ నేర్చినారు కాని, మానవత్వమనగా ఏమిటో గుర్తించుకొనలేకపోతున్నారు. ఏకత్వమును అనేకత్వంగా విభజిస్తున్నారు గాని, అనేకత్వంలో ఉన్న ఏకత్వమును ఎవ్వరూ గుర్తించడం లేదు. ప్రేమ స్వరూపులారా! ఏకత్వంలో అనేకత్వమును దర్శించటం చాలా సులభం. అది ప్రతి మానవుడూ చేయగలడు. మనం అనేకత్వంలో ఉన్న ఏకత్వమును దర్శించుటకు తగిన కృషిచేయాలి. అనగా, ఆత్మతత్త్వమును గుర్తించుటకు ప్రయత్నించాలి. అందరియందున్నటువంటి ఆత్మ ఒక్కటియే. అట్టి ఆత్మతత్త్వమును గుర్తిస్తే, సర్వమును గుర్తించినటువంటివారమవుతాము. మానవులందరూ ఒక్కటే.

**మతములన్నియు వేరు, మార్గంబు ఒక్కటే**
**వస్త్ర భేదము వేరు, వస్తువొకటె**
**శృంగారములు వేరు, బంగార మొక్కటే**
**పశుల వన్నెలు వేరు, పాలు ఒకటె**
**జీవజంతులు వేరు, జీవుండు ఒక్కడే**
**జాతి నీతులు వేరు, జన్మమొకటె**
**దర్శనంబులు వేరు, దైవంబు ఒక్కడే**
**పూల వన్నెలు వేరు, పూజ ఒకటె**

భిన్నత్వమనేది మనము కల్పించుకున్నదేగాని, దైవము యొక్క సృష్టి కాదు. కనుక,

sri sathyasai vachanamrutam

ఐకమత్యమును మనము సాధించాలి. 'యూనిటీ' (ఏకత్వం) ఉన్నప్పుడే మన హృదయంలో 'ప్యూరిటీ' (పవిత్రత) ఏర్పడుతుంది. ఎప్పుడు 'ప్యూరిటీ' ఏర్పడుతుందో అప్పుడే 'డివినిటీ' (దైవత్వం) ఆవిర్భవిస్తుంది. 'యూనిటీ, ప్యూరిటీ, డివినిటీ' – ఈ మూడూ ఒకదానితో ఒకటి సన్నిహిత సంబంధం కలిగియున్నవి.

ప్రతి మానవునియందు దివ్యత్వమున్నది. దైవత్వం లేకుండా జీవత్వం సంభవించదు. 'దైవం మానుష రూపేణ'. దైవత్వంతోకూడినటువంటివాడే మానవుడు. కాని, మానవత్వమంటే ఏమిటో మీరు తెలుసుకోవడం లేదు. కేవలం మానవాకారం గలవాడే మానవుడని భావిస్తున్నారు. దేహములు వేర్వేరుగా ఉన్నప్పటికీ ప్రతి మానవునియందు ఉన్నటువంటి ఆత్మతత్త్వం ఒక్కటే. ఇట్టి ఏకత్వమును గుర్తించుకొనలేక అనేకమంది అనేకవిధములుగా మానవజాతిని విభజిస్తున్నారు. ఈనాడు ప్రపంచంలో ఇన్నివిధములైన కలహములు, భేదములు, కష్టములు, దుఃఖములు సంభవించుటకు కారణం ఇదియే! అందరియందున్న దైవత్వం ఒక్కటే అనే సత్యాన్ని మనం గుర్తించుకున్నప్పుడు ఏవిధమైన భేదములుగాని, కష్టములుగాని ఉండవు. కనుక, మొట్టమొదట దైవత్వాన్ని దృష్టిలో పెట్టుకోవాలి; మన హృదయంలో ప్రతిష్ఠించుకోవాలి. దైవత్వాన్ని విస్మరించి అనేకత్వాన్ని పెంచుకుంటే మనకన్నీ బాధలే కలుగుతాయి. 'వీడు రామన్న', 'వీడు లక్ష్మన్న' అని వ్యక్తుల రూపనామములపై మాత్రమే దృష్టి నిలుపక అందరిలో ఉన్న ఆత్మతత్త్వంపై దృష్టి పెట్టాలి. ఇతనిలో ఆత్మ ఉంది, అతనిలో ఆత్మ ఉంది. ఈవిధంగా, అందరిలో దైవత్వం ఉన్నదనే సత్యాన్ని హృదయంలో నిల్పుకోవాలి. అందరినీ దైవస్వరూపులుగా భావించ కుండా మనం జపములు, తపములు, యజ్ఞములు, యాగములు ఎన్ని చేసినప్పటికీ ప్రయోజనం లేదు.

నీకొక పేరు ఉన్నది. ఆ పేరు ఎవరు పెట్టారు? నీ తల్లిదండ్రులు పెట్టారు. అది కేవలం పెట్టిన పేరేగాని, పుట్టిన పేరు కాదు. అందరియందు సమానంగా ఉన్నటువంటిది ఆత్మతత్త్వం. అదే అందరినీ రమించేటటువంటి రామతత్త్వం. ఆత్మ అన్నా, బ్రహ్మ అన్నా, ఓంకారమన్నా, 'రామా' అన్నా అంతా ఒక్కటే. కాని, ఈనాటి మానవుడు 'అహం బ్రహ్మాస్మి' అనే భావమును విసర్జించి, అహంకారంతో 'అహం రామయ్య', 'అహం కృష్ణయ్య' అని భావిస్తున్నాడు. అందుచేతనే అనేక విధములైన భేదములు ఏర్పడుతున్నవి. మనం ఎదుటి

sri sathyasai vahanmrutam

వ్యక్తికి నమస్కారం పెట్టి, మనసులో 'రామా' అనుకుంటే, ఆ నమస్కారం రామునికే చెందుతుంది. నీ విరోధి నీకు ఎదురయినప్పుడు మొహం తిప్పుకోవద్దు; వానికికూడా నమస్కారం పెట్టు. ఆ నమస్కారం దైవానికే చేరుతుంది. 'హలో' అని వానిని ప్రేమతో పలుకరించు. వాడుకూడా ద్వేషాన్ని విడనాడి నీతో స్నేహం చేస్తాడు.

**భగవంతుని పొందుటకు భగవన్నామమే ఆధారం**

సీతాన్వేషణ నిమిత్తం బయల్దేరిన వానర వీరులు సముద్ర తీరమును చేరుకొన్నారు. లంకానగరమును చేరుకోవాలంటే నూరు యోజనములు దాటాలి. అంగదుడు వానరులందరినీ సమావేశపరచి ఎవరెవరి శక్తి ఎంతటిదో తెలుసుకోవడానికి ప్రయత్నించాడు. ఒకడు నలభై యోజనములు దాటగలనన్నాడు. మరొకడు యాభై యోజనములు దాటగలనన్నాడు. ఇంకొకడు అరవై యోజనములు దాటగలనన్నాడు. కాని, హనుమంతుడు మాత్రం "రాముని అనుగ్రహమే ఉంటే, నేను ఎన్ని యోజనములైనను దాటగలను" అన్నాడు. పూర్ణ తత్త్వాన్ని గుర్తించినవాడు, పరిపూర్ణ విశ్వాసం కలిగినవాడు కనుకనే హనుమంతుడు ఆవిధంగా చెప్పగలిగాడు. భగవంతుణ్ణి పొందుటకు కావలసినవి జపములు, తపములు, యజ్ఞములు, యాగములు, యోగములు కావు. జపతపములు అందరూ చేస్తూనే ఉన్నారు. కాని, ఏం సాధిస్తున్నారు? ఇవన్నీ కేవలం బాహ్యమైన, లౌకికమైన కర్మలు. భగవంతుని పొందుటకు భగవన్నామమే ఆధారం. ఎన్ని సాధనలు చేసినప్పటికీ మన హృదయంలో భగవన్నామం లేకపోయెనా, అన్నీ వ్యర్థమైపోతాయి. భగవన్నామంతో మనం సర్వమును సాధించవచ్చును. అందుకోసమే నేను అప్పుడప్పుడు చెబుతుంటాను – "భజన బినా సుఖ శాంతి నహీ." ఒక్క భగవన్నామమే అన్నింటినీ సాధించ గలదు. కనుకనే, హనుమంతుడు రామనామాన్ని స్మరిస్తూ సముద్రాన్ని దాటగలిగాడు.

**ఆత్మతత్త్వాన్ని నమ్మాలి, రూపనామములను కాదు**

ఈ జగమంతా నిండియున్నది రామతత్త్వమే. ఈ సూక్ష్మతత్త్వాన్ని ఎవ్వరూ గుర్తించుకొనలేకపోతున్నారు. అందరూ కేవలం బాహ్యమైన, భౌతికమైన, లౌకికమైన



sri sathyasai vahini amrutam

సాధనలు చేస్తున్నారు. ఈనాడు సైంటిస్టులుకూడను భౌతికమైనవాటిని మాత్రమే అభివృద్ధి చేస్తున్నారు. నిమిషానికి ఎన్నో మైళ్ళ వేగంతో ప్రయాణించే ఏరోప్లేన్లు తయారు చేస్తున్నారు. కాని, భౌతికమైన వస్తువులు ఎన్ని తయారు చేసినప్పటికీ అవన్నీ ఏదో ఒకనాటికి నాశనమయ్యేటటువంటివే! అవి తయారు చేయటం గొప్పతనం కాదు. ప్రజలకు అనుకూలమైనటువంటివి, క్షేమాన్ని కలిగించేటటువంటివి మనం అభివృద్ధి చేయాలి. సమాజం సుక్షేమంగా ఉన్నప్పుడే మనం సుక్షేమంగా ఉండగలము. కాని, ఇప్పుడు సమాజ శ్రేయస్సుగురించి ఎవ్వరూ యోచించడం లేదు. ఎవరిని చూసినా స్వార్థము, స్వప్రయోజనమే! ప్రజల క్షేమంకోసం పాటుపడేవారే లేరు. అందువల్లనే ఈనాడు జగత్తంతయు ఛిన్నాభిన్నమైపోతున్నది. ఒక ఇంట్లో నలుగురుంటే, ఆ నలుగురూ విడిపోయి నాలుగు ఇళ్ళు ఏర్పర్చుకుంటున్నారు. మానవునిలో ఇటువంటి భేదభావం అభివృద్ధి కావడంచేతనే ఏకత్వం క్షీణించిపోయింది. మనమిప్పుడు యూనిటీని పెంచుకోవాలి. "పక్కింటివాడూ, నేనూ ఒక్కటే. కేవలం రూపనామములు వేరుగా ఉన్నాయిగాని, మా ఇద్దరిలో ఉన్న భగవంతుడు ఒక్కడే." ఇట్టి దివ్యమైన భావమును హృదయంలో నిల్పుకొని నీ గృహస్థ ధర్మాన్ని నీవు ఆచరించు. ఇవన్నీ లౌకికమైన ధర్మములు. కాని, ఆత్మధర్మం ఒక్కటే. అట్టి ఆత్మతత్త్వాన్ని గుర్తించుకొని మెలగాలి. కేవలం రూపనామములపై ఆధారపడకూడదు; ఆత్మతత్త్వాన్నే నమ్మాలి. అందరిలో ఉన్న ఆత్మ ఒక్కటే. కనుకనే, నేను మిమ్మల్ని 'దివ్యాత్మ స్వరూపులారా!' అని సంబోధిస్తున్నాను. మీరుకూడా కొన్ని సందర్భాలలో "నా ఆత్మసాక్షిగా చెబుతున్నాను" అని అంటారు కదా! శరీరం క్షీణించినప్పటికీ ఆత్మ జీవించే ఉంటుంది. మానవుడు పుడుతున్నాడు, పెరుగుతున్నాడు, మరణిస్తున్నాడు అని మనం చెపుతున్నామేగాని, మానవుడు పుట్టడమూ లేదు, పెరగటమూ లేదు, మరణించడమూ లేదు. పుట్టేదీ, పెరిగేదీ, మరణించేదీ దేహమేకాని, ఆత్మ కాదు. ఇట్టి, ఏకత్వాన్ని గుర్తించండి. ఎవరెన్ని చెప్పినప్పటికీ మీ ఆత్మసాక్షిని మీరు అనుసరించండి. దానిని ఎట్టి పరిస్థితులలోనూ మనం వదలకూడదు.

**మోహం క్షీణించినప్పుడే మోక్షం లభిస్తుంది**

srisathyasaivachanamrutam

మనం ఏ పని చేసినప్పటికీ ఆత్మకోసమే చేయాలి. ప్రతి ఒక్కటికూడను దైవార్పిత బుద్ధితో ఆచరించాలి. "సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం" అనే భావన హృదయంలో పెట్టుకున్నప్పుడు మనకు మోక్షం సులభంగా లభిస్తుంది. భౌతికమైన మోహం క్షీణించినప్పుడే మోక్షం లభిస్తుంది. 'నేను' అనే అహంకారం, 'నాది' అనే మమకారం ఈ రెండూ మనలో ఉండడంచేతనే ఈ ప్రపంచం మనల్ని కట్టివేస్తున్నది. కనుక, మనం మొట్టమొదట అహంకార, మమకారములు లేకుండా జీవించటానికి ప్రయత్నించాలి. వీటిని ఎంత తగ్గించుకుంటామో మోక్షాన్ని అంత సమీపిస్తాము. Less luggage, more comfort makes travel a pleasure. కాబట్టి, జీవిత ప్రయాణంలో వాంఛలనే 'లగేజి'ని తగ్గించుకుంటూ రావాలి. కాని, ఈనాడు మనిషి పెరిగేకొలదీ వాంఛలు పెరుగుతూనే ఉన్నాయి. వాంఛలు పెరిగేటప్పటికి మనిషి క్షీణించిపోతున్నాడు; దైవత్వమనేది మనిషిలో పూర్తిగా మరుగునపడిపోతున్నది. ముఖ్యంగా మనం పోషించుకోవలసినది దైవత్వమే! మిగిలినవి మనము ఎంత భద్రంగా దాచిపెట్టుకున్నప్పటికీ అవన్నీ ఏనాటికైనా క్షీణించేటటువంటివే! మనం సంపాదించిన డబ్బును బ్యాంకులో దాచిపెట్టవచ్చును; బీరువాలో పెట్టి బీగం వేయవచ్చును; సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవచ్చును. కాని, ఏదో ఒకనాటికి అంతా భస్మమైపోతుంది. ఎప్పటికైనా ఎక్కడికి వెళ్ళినా మనలో క్షీణించకుండా ఉండేటటువంటిది ఒక్క ఆత్మతత్త్వమే. అదే అహం తత్త్వము.

**దైవనామాన్ని స్మరిస్తూ ఉంటే మనకు కష్టములే కల్గవు**

అనేక వేల సంవత్సరాల క్రిందట శ్రీరాముడు అవతరించాడు. సర్వులను రమించేటటువంటిది రామతత్త్వం. కనుకనే, అతనికి 'రామా' అని పేరు పెట్టారు. ఇప్పటికీ జనులు రామనామాన్ని తలుచుకుంటూనే ఉన్నారు. ఎవరికైనా ఏదైనా బాధ కలిగితే 'రామా, రామా' అంటున్నారు. మరణించేవాళ్ళ చెవిలోకూడా 'రామా, రామా' అని ఉచ్చరిస్తున్నారు. మనం రమించవలసినది రామనామమే తప్ప అన్యము కాదు. ఏ నామమైనా సరే, దైవతత్త్వాన్ని ఆత్మతత్త్వంగా విశ్వసించి, దానిని మనం స్మరిస్తూ ఉంటే, ఎప్పటికీ మనకు కష్టములే కలుగవు. ఎంతో సంపాదిస్తున్నాం మనము. కాని ఎవరికోసం? కట్టకడపటికి

sri sathyasai vachanamrutam

నీవేమైనా కనీసం ఒక నయాపైసా అయినా చేతిలో పట్టుకొని పోతున్నావా? లేదే! నీ దేహాన్నికూడా నీవు వదలిపెట్టి పోతున్నావు. మనస్సు చలిస్తుంది. బుద్ధి భ్రమిస్తుంది. కాని, ఆత్మ మాత్రం సాక్షీభూతంగా ఉంటుంది. అదే రామతత్త్వము. కనుక, 'రామ' అనేది ఒక రూపము యొక్క పేరు కాదు; అది దైవత్వముయొక్క పేరు. 'రామా' అనిగాని, లేక 'కృష్ణా' అనిగాని ఏదైనా ఒక నామాన్ని స్మరిస్తూరండి. 'శివం' అంటే మంగళకరము. మంగళకరమైనదానిని అందించేది ఒక్క దైవనామమే. మనం 'శ్రీనివాసా' అంటాము, 'వేంకటేశా' అంటాము, 'రామా' అంటాము. ఈ అన్ని పేర్లుకూడను ఒకే దైవానికి సంబంధించినవి. ఇలాంటి భగవత్తత్త్వమును మీరు హృదయంలో స్థిరం చేసుకోవాలి. కొంతమంది 'రాం, రాం, రాం' అని జపిస్తుంటారు. కాని, కొంతసేపటికి ఆ జపం ఆగిపోతుంది; ఆ తరువాత వాళ్ళు రాముణ్ని మరచిపోతారు. ఏమి ప్రయోజనం? మనం ఏ పని చేసినా, దైవ నామాన్ని స్మరిస్తూ చేయాలి. కలియుగంలో చాలా ప్రధానమైనది నామస్మరణే. ఈ సత్యాన్ని గుర్తించుకొని గురునానక్ 'సామూహిక భజన' అనేది ప్రారంభించాడు. అందరూ చేరి భజన చేయాలి. ఒకరి మనస్సు ఒకవైపు, ఇంకొకరి మనస్సు ఇంకొక వైపు పోవచ్చు. కాని, ఇంతమందిలో ఏ కొందరి మనస్సులైనా భగవంతుని నామముపై స్థిరంగా నిలిచి ఉంటాయి; ఏ కొందరి ప్రేమ అయినా భగవంతుణ్ని చేరుతుంది. అదే అందరినీ రక్షిస్తుంది.

**ఐకమత్యంలో ఎంతో గొప్ప ఫలితమున్నది**

పుత్రకామేష్టి యాగసందర్భమున యజ్ఞపురుషుడు ప్రసాదించిన పాయసమును దశరథుడు తన ముగ్గురు భార్యలకు సమానంగా పంచిపెట్టాడు. ఐతే, సుమిత్ర అభ్యంగస్నానమాచరించి, మిద్దెపైన పాయసపు గిన్నెను పెట్టి, గాలికి కురులార్పుకుంటున్న సమయంలో ఒక గ్రద్ద వచ్చి ఆమె పాయసపు గిన్నెను తన్నుకొని పోయింది. జరిగినదానికి బాధపడుతూ, దశరథ మహారాజు ఏమంటాడో అని భయపడుతూ ఆమె క్రిందికి పరుగెత్తుకొని వచ్చి కౌసల్య, కైకేయిలకు జరిగిన సంగతి వివరించింది. ఈనాటి సవతులవలె కాకుండా వాళ్ళు ఎంతో ఐకమత్యంగా, అన్యోన్య ప్రేమానురాగాలతో మెలగేవారు. కౌసల్య సుమిత్రను ఓదార్చుతూ, "నువ్వేం భయపడవద్దు. ఇదిగో, నా

sri sathyasai vahini

పాయసంలో అర్ధ భాగము నీకిస్తాను" అని చెప్పింది. కైకకూడను తన పాయసంలో అర్ధభాగము సుమిత్ర గిన్నెలో పోసింది. ఆ ఐకమత్యమనేది ఎంత గొప్ప ఫలితం ఇచ్చిందో చూడండి! ఐకమత్యంగా ఉండటంచేతనే వారు దైవానుగ్రహాన్ని పొందారు. కౌసల్యకు రాముడు పుట్టాడు. కైకకు భరతుడు పుట్టాడు. సుమిత్రకు మాత్రం ఇద్దరు కుమారులు పుట్టారు. ఎందుకంటే, ఆమె స్వీకరించిన పాయసంలో అర్ధ భాగం కౌసల్యది, అర్ధభాగం కైకది. ఆ రెండు అర్ధ భాగములూ రెండు రూపములుగా రూపొందాయి. ఆ ఇద్దరికీ లక్ష్మణ, శతృఘ్నులని పేర్లు పెట్టారు.

కౌసల్య పాయసంనుండి వచ్చినవాడు కనుక, లక్ష్మణుడు ఎప్పుడూ రామునివెంటనే ఉండేవాడు. కైక ఇచ్చిన పాయసం నుండి పుట్టినవాడు కనుక, శతృఘ్నుడు నిరంతరం భరతుని వెంటనే ఉండేవాడు. "ఆహా, రాముడు రాజ్యమేలితే లక్ష్మణుడు అతనికి మంత్రిగా ఉండి సహాయం చేస్తాడు. భరతుడు రాజ్య మేలితే శతృఘ్నుడు మంత్రిగా ఉండి అతనికి సహాయపడతాడు" అని సుమిత్ర ఎంతో ఆనందిస్తూ వచ్చింది. ఆమె అందరికీ మంచి మిత్రురాలు కనుకనే, ఆమెకు 'సుమిత్ర' అనే పేరు సార్థకమైంది. రాముడు అరణ్యానికి వెళుతున్నాడని కౌసల్య దుఃఖిస్తుంటే, సుమిత్ర ఆమెవద్దకు వెళ్ళి, "అక్కా! ఎందుకు నీవు దుఃఖిస్తున్నావు? రాముడు ఎవరనుకున్నావు? సామాన్య మానవుడు కాడు, అతను సాక్షాత్తు భగవంతుడు. అతనికి ఎటువంటి ఆపదా సంభవించదు," అని ధైర్యం చెప్పి ఓదార్చింది. ఆమె ధైర్యం చెప్పటంవల్లనే కౌసల్య అయోధ్యలో ఉండ గలిగింది; లేకపోతే, రామునితోపాటు తానుకూడా అరణ్యానికి వెళ్ళేది.

ఇక, సుమిత్రయొక్క పాయసపు గిన్నెను తన్నుకొని పోయిన గరుడపక్షి దానిని ఒక పర్వతంపైన ధ్యానం చేసికొంటున్న అంజనాదేవి ఎదుట జారవిడిచింది. ఆ పాయసాన్ని అంజనాదేవి భుజించగా ఆమె గర్భంలో హనుమంతుడు జన్మించాడు. కనుకనే, రామ లక్ష్మణులకు హనుమంతునితో స్నేహం కలగడం, హనుమంతుడు వారిరువురినీ తన భుజాలమీద ఎత్తుకొని ఋశ్యమూక పర్వతంపైకి తీసికొనివెళ్ళి సుగ్రీవునికి పరిచయం చేయడం జరిగింది. అప్పటి నుండి వీరు ఒకరినొకరు వదలి ఉండేవారు కాదు. ఈవిధంగా ఐకమత్యమనేది ఎంత బలము నిచ్చిందో చూడండి! ఐకమత్యమే మహాబలం. మీరు

sri sathyasai vahamrutam

ఒకరితో ఒకరు మాట్లాడకుండా శత్రుత్వం వహిస్తే ఏమీ సాధించలేరు. మీమధ్య అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ సర్దుకుపోవడం (అడ్జస్ట్‌మెంట్) అలవాటు చేసుకోవాలి. భక్తులైనవారు ఈవిధమైన 'అండర్‌స్టాండింగ్, అడ్జస్ట్ మెంట్' చేసికొని అందరితో చక్కగా మెలగాలి. మీరు పూజించే దైవాన్ని ఎవరైనా దూషించినప్పటికీ వారినేమీ అనకండి. "దేవుడే ఈ రూపంలో వచ్చి చెబుతున్నాడు" అని అనుకోండి! మీరు అందరినీ ప్రేమించి నప్పుడు మీలోని వాంఛలు, ద్వేషము, క్రోధము ఇత్యాది దుర్గుణాలు తొలగిపోయి మీకు మోక్షం సులభంగా లభిస్తుంది.

**ఆత్మతత్త్వాన్ని అనుసరించడమే ఆధ్యాత్మికం**

ఇప్పుడు ఇక్కడ ఇంతమంది చేరి భజన చేశారు. కాని, ఎందరి హృదయంలో నిజమైన భక్తి ఉంది? 'భక్తులం, భక్తులం' అని చెప్పుకుంటూ ఈర్ష్య, క్రోధము, డంబము ఇత్యాది దుర్గుణాలను మీ హృదయంలో పెట్టుకొంటే మీరు అన్నివిధాలుగా నష్టపోతారు. ఎవరిని చూసినా, "ఇతను నా సోదరుడు, ఈమె నా సోదరి" అనేటటువంటి విశాలమైన భావంతో మీరు అందరితో ఐకమత్యంగా ఉండండి. అందరూ దైవంయొక్క బిడ్డలే! ఏ విషయంలోనైనా మీలో మీకు కొంత భేదము ఏర్పడినప్పటికీ మీరంతా ఒక్కటేగాని, వేరువేరు కాదు. ఇట్టి ఏకత్వాన్ని మీరు విశ్వసించండి; ఏకత్వాన్ని సాధించండి; ఏకత్వాన్ని అనుభవించండి. అనేకత్వంలోని ఏకత్వమే దైవతత్త్వం. అదే ఆధ్యాత్మిక తత్త్వం. ఆధ్యాత్మికమంటే కేవలం సద్గ్రంథాలు చదవడం, పూజలు చేయడం, వ్రతములు చేయటం కాదు; ఆధ్యాత్మికమంటే ఆత్మతత్త్వాన్ని అనుసరించడం.

**సత్యధర్మశాంతిప్రేమ అహింసలే మన పంచప్రాణాలు**

మీరందరూ నిరంతరం 'సాయిరాం, సాయిరాం, సాయిరాం' అని స్మరిస్తున్నారు కదా! కాబట్టి, మీరు భక్తులమని భావించినప్పుడు పదిమందికి ఉపకారం చేయాలి. అందరితోనూ ఐకమత్యంగా, సంతోషంగా ఉండాలి. ఎవరిపైనా ద్వేషం పూనకూడదు. అందరినీ ప్రేమించాలి. అప్పుడే మీకు ఆనందం కలుగుతుంది. మీరందరూ సత్య, ధర్మ, శాంతి, ప్రేమలతో మీ జీవన యాత్ర సాగించాలని చెప్పటంలో అంతరార్థమేమిటి? సత్య, ధర్మ,

sri sathyasai vachanamrutam

శాంతి, ప్రేమలే ప్రధానమైన మానవతా గుణములు. ఈర్ష్య, అసూయ, డంబము, కామ, క్రోధ, ద్వేషములు మానవతా గుణములు కావు. "నాకు శాంతి కావాలి, శాంతి కావాలి" అని శాంతికోసం కొందరు జపతపాదులు చేస్తుంటారు. కాని, ఏ కించిత్తైనా శాంతి పొందుతున్నారా? లేదు. ప్రేమలో జీవించినప్పుడే శాంతిని పొందగల్గుతారు. ఇది బజారులో కొనేటటువంటి వస్తువు కాదు; మీ హృదయమునుండియే ఆవిర్భవిస్తుంది. అది ప్రేమనుంచే పుడుతుంది. ప్రేమ ఎక్కడినుండి వస్తుంది? ధర్మంనుంచి వస్తుంది. ధర్మం ఎక్కడినుండి వస్తుంది? సత్యంనుండి వస్తుంది. "సత్యాన్నాస్తి పరో ధర్మః". కాబట్టి, సత్యంనుండి వచ్చినది ధర్మం. ధర్మంనుండి వచ్చినది ప్రేమ. ప్రేమనుండి వచ్చినది శాంతి. ఇవన్నీ చేరినప్పుడే అహింస ఏర్పడుతుంది. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలే మన పంచప్రాణాలు. కాని, ఈ పంచప్రాణాలను ఈనాడు మరచిపోయి, అసహ్యకరమైన కామక్రోధాదులను మన ప్రాణాలుగా పెట్టుకున్నాము. అందువల్లనే ఎన్నో అవస్థలు పడుతున్నాము. సత్యధర్మాలను పోషించుకోండి, మీరు తప్పక శాంతి పొందుతారు.

**సర్వుల క్షేమంకోసం నీవు పాటుపడకపోతే నీకు కలిగేది క్షామమే!**

నిజంగా మీరు నమ్ముతారో, నమ్మరోగాని, ఇంక ఇరవై ఐదు, ముప్పై సంవత్సరములలోపలనే ఈ ప్రపంచమంతా ఏకమైపోతుంది. అందరూ ఏకమై భారతీయులనుండి భగవద్భక్తిని సాధిస్తారు. 'ఇండియన్ కల్చర్' (భారతీయ సంస్కృతి) అంటే ఏవో కొన్ని పద్ధతులు అని మీరనుకుంటున్నారు. కాదు, కాదు. 'కల్చర్' అంటే అందరియొక్క ఏకత్వమే! 'యూనిటీ'యే కల్చర్. 'ప్యూరిటీ'యే కల్చర్. ఆ 'యూనిటీ', 'ప్యూరిటీ' ఉన్నప్పుడే మీరు 'డివినిటీ'ని సాధిస్తారు. కాబట్టి, మీలో ఉన్న ద్వేషాన్ని, క్రోధాన్ని కాల్చివేయండి. ప్రేమను పెంచుకుంటే ద్వేషం మాడిపోతుంది, క్రోధం కాలిపోతుంది. ఈనాడు సమాజంలో క్రోధము, ద్వేషము చాలా అధికమైపోతున్నాయి. 'వాడు దండిగా సంపాదించాడు. వాడు గొప్ప వాడైపోతున్నాడే!' అని ఒకరిని చూస్తే ఒకరికి ద్వేషం! గెలిచినవానిపై ఓడినవానికి ద్వేషం! ఇది మంచిది కాదు. "ఏదో వాడు బాగా చేశాడు కాబట్టి, వాడు గెలిచాడు. నాలో ఉన్నటువంటి లోపమే నన్ను ఓడించింది. కనుక, నేనుకూడా అట్టి

sri sathyasai vachanamrutam

విశాలమైన ప్రేమను పెంచుకోవాలి. నా హృదయం విశాలమైనప్పుడు తప్పక నేనుకూడా గెలుస్తాను" అని భావించాలి. గెలుపుకుగాని, ఓటమికి గాని కారణం మన భావాలలో ఉన్న మార్పులే! దీనిని పురస్కరించుకొనియే వేదము 'మనయేవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః' అన్నది. ద్వేషానికిగాని, ఐకమత్యానికిగాని మూలకారణం మన మనస్సే. మనం చేసే ప్రతి పనికూడను ఐకమత్యంగా చేయాలి. దైవప్రీతిని అభివృద్ధిపరచుకోవాలి. అప్పుడు తప్పక లోకక్షేమం కలుగుతుంది. మనం అందరి క్షేమాన్ని కోరుకోవాలి. క్రిమికీటకాదుల క్షేమాన్నికూడా కోరాలి. కనుకనే, భజన తరువాత మనం "లోకాస్సమస్తా స్సుఖినో భవంతు" అని అంటున్నాము. సర్వులూ క్షేమంగా ఉండాలి. ఆ క్షేమంలోనే నీ క్షేమంకూడా ఉంటుంది. సర్వులయొక్క క్షేమంకోసం నీవు పాటుపడకపోతే నీకు కలిగేది క్షామమే తప్ప క్షేమం కాదు. కనుక, అందరూ క్షేమంగా ఉండాలని మనం కోరుకోవాలి. అందరి క్షేమాన్ని కోరేవారి హృదయాన్నే భగవంతుడు ఇష్టపడతాడు.

నేను చెబుతున్నది పరమ సత్యము. ఇదే నిజమైన భక్తియొక్క సారము. 'డివోషన్' (భక్తి) అంటే ఏమిటి? ఏదో సాధారణమైన 'ఓషన్' (సముద్రం) కాదు; అది ఆనంద సాగరం. అదే "నిత్యానందం పరమ సుఖదం కేవలం జ్ఞానమూర్తిం...." అట్టి ఆనందాన్ని మనం సాధించాలి.

**– తేదీ 31.5.2008, సాయిరమేశ్ క్రిషన్ హాలు, బృందావనం**

sri sathyasai vahamrutam